క్లుప్తంగా

బండారి, పట్టువస్త్రాల సమర్పణ



ఐనవోలు : మల్లికార్జునస్వామి, అమ్మవార్లకు సోమవారం మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్టు సభ్యులు బండారి, పట్టు వస్త్రాలు సమర్పించారు. వందలాది మంది ట్రస్టు సభ్యులు ఏకరూప దుస్తులు ధరించి సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద నుంచి మల్లికార్జునస్వామి దేవాలయం వరకు పాదయాత్ర, ర్యాలీ నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. కాగా ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి బండారి, పట్టు వస్త్రాలు స్వీకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ఎస్సై పస్తం శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి లీలావతి, యాదగిరి, ప్రభుకుమార్, కౌశిక్, ప్రశాంతి పాల్గొన్నారు.

మధార్‌షావలి ఉర్సుకు ఏర్పాట్లు పూర్తి



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలో గల హజ్రత్ సయ్యద్ మధార్‌షావలి దర్గా ఉర్సుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రి తెలిపారు. ఈనెల 08న గంధం, 09న ఉర్సు ఉంటుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా ఎనిమిది దశాబ్దాల నుంచి ఉర్సు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ నుంచి సుమారు 30 వేల పైచిలుకు భక్తులు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. బుధవారం సాయంత్రం పరకాల జామా మస్జీద్ నుంచి పవిత్ర జెండాతో ఊరేగింపుగా కవ్వాలి, షాషాబ్‌ల విన్యాసాలతో గంధం తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

శాయంపేట : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్సై పరమేశ్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావొద్దని అన్నారు. డ్రంకెన్‌డ్రైవ్, త్రిపుల్ రైడింగ్ కు పాల్పడవద్దని అన్నారు.

ప్రమాణస్వీకారం చేసిన చంద్రప్రకాశ్

శాయంపేట : రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ సోమవారం హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు హైదరాబాద్‌లో చంద్రప్రకాశ్‌ను శాలువాతో, చేనేత వస్త్రంతో సన్మానించారు.

కోతదశలో సస్యరక్షణ చర్యలు కీలకం

నర్సంపేట రూరల్ : మిర్చి పంట కోత దశలో సస్యరక్షణ చర్యలు కీలకమని హార్టికల్చర్ అధికారి జ్యోతి స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట, భాంజీపేట గ్రామాల్లో మిర్చి పంటలను సోమవారం ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మిర్చి పంట బాగా పండిన తర్వాతే కోయాలని చెప్పారు. బాగా ఆరబెట్టి తేమ లేకుండా చూసుకోవాలని తెలిపారు. చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలన్నారు. మంచి మిర్చి నుంచి తాలు వేరు చేసి బస్తాల్లో వేర్వేరుగా నింపాలని సూచించారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంటను సరైన ధరకు విక్రయించొచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు సాంబయ్య, మొలుగూరి సురేందర్, కేశెట్టి సదానందం తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను పొదుపుగా వాడుకోవాలి

నల్లబెల్లి : గోదావరి జలాలను రైతులు పొదుపుగా వాడుకోవాలని దేవాదుల డీఈ యశ్వంత్ కోరారు. మండలంలోని రంగయ్య చెరువులోకి గోదావరి జలాలు విడుదల కాగా సోమవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి మాట్లాడారు. రైతుల సాగునీటి అవసరాల కోసం పాకాల పైప్‌లైన్ ద్వారా గోదావరి జలాలను చెరువులోకి రెండ్రోజులుగా వదులుతున్నట్లు తెలిపారు. రైతులు సాగునీటిని వృథా చేయవద్దని సూచించారు.

మినీ జాతరకు సమస్యల స్వాగతం



జాతర ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



జాతర ప్రాంగణంలో గద్దెలు

- సమీపిస్తున్న అగ్రంపహాడ్ మినీ జాతర
- అభివృద్ధిపై దృష్టిసారించని అధికారులు
- మందుబాబులకు అడ్డాగా పరిసరాలు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జాతర నిర్వహణ, అభివృద్ధి పనులపై అధికారులు దృష్టిసారించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. సమ్మక్క-సారలమ్మ మినీ జాతర ఫిబ్రవరిలో జరగనుండడంతో సమస్యల పరిష్కారం, నిర్వహణపై అధికారులు ఇప్పటికే దృష్టిసారించాల్సి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. జాతరకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంటుందని, మేడారం జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతర పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. పరిసరాల్లో గల చెట్లను సంరక్షించలేదని, జాతర గద్దెలకు, క్యూలైన్లకు మరమ్మతులు చేయాల్సి ఉందని అంటున్నారు. అలాగే జాతరకు వివిధ గ్రామాలతో అనుసంధానంగా ఉన్న రోడ్లు ప్రమాదకరంగా మారాయని, గతేడాది జాతరకు ముందు మరమ్మతులు చేసినప్పటికీ మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అలాగే జాతరలో నీటి వసతి, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జాతర నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా అగ్రంపహాడ్-తక్కళ్లపహాడ్ రోడ్డు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు : నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి, మద్దెలగూడెం గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం, వేలేరు మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. తాను ఏలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడనని, పదవులు ఇస్తానని ఎవరి దగ్గర రూపాయి తీసుకోలేదని అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు ఏలాంటి తలవంపులు తీసుకురానని అన్నారు. మండలానికి ఈజీఎస్ నిధులు కోటి మంజూరు అయ్యాయని, వాటితో మండలంలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అనంతరం వేలేరు రైతు వేదికలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకుముందు వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో షోడాషపల్లి నుంచి చిల్పూర్ మండలంలోని కొండాపూర్ సమ్మక్క సారలమ్మ ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సంపత్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్, రాజిరెడ్డి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సుధాకర్‌కు కొమురంభీమ్ నేషనల్ అవార్డు



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దుబ్బా సుధాకర్‌కు బహుజన సాహిత్య అకాడమీ కొమురం భీమ్ నేషనల్ అవార్డు-2024ను అందించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, విష్ణు, వనమాల, పద్మావతి, రమేశ్, రామకృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగదీశ్‌బాబుకు డాక్టరేట్



పరకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకుడు కె.జగదీశ్ బాబుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్రం ప్రొఫెసర్ శివరాజ్ పర్యవేక్షణలో పలు అంశాలపై పరిశోధనలు చేసినందుకు ఈ అవార్డు ప్రదానం చేసినట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సంతోశ్‌కుమార్‌తో పాటు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

హమాలీలకు న్యాయం చేయాలి

- సీపీఎం పట్టణ కార్యదర్శి కల్యాణ్

పరకాల : సివిల్‌సప్లై హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్ల ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని సీపీఎం పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా పరకాల సివిల్‌సప్లై గోదాం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టిన హమాలీ కార్మికులకు సీపీఎం నాయకులు సోమవారం సంఘీభావం తెలిపారు. హమాలీల ఎగుమతి రేట్ల జీఓను ఏడాదిగా అమలు చేయకుండా అధికార యంత్రాంగం కాలయాపన చేస్తుందని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. హమాలీలకు న్యాయం చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న కల్యాణ్

ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు గడ్డం సురేష్, మచ్చ శంకర్, మచ్చ సందీప్, బొచ్చు కృష్ణ, భిక్షపతి, జూపాక చంద్రమౌళి, కొమ్ముల మహేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వేతనాలు చెల్లించాలని పంచాయతీ సిబ్బంది భిక్షాటన



నడికూడ : కొన్ని నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి ఐదు నుంచి తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించలేదని తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, అధికారులను అడిగితే జీపీల్లో నిధులు లేవని చెబుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు.

ఎర్రకుంట తూముకాల్వ ఆక్రమణపై విజిలెన్స్ విచారణ

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎర్రకుంట తూముకాల్వ భూమిని కొందరు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారనే ఫిర్యాదు మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ ఎర్రకుంట తూముకాల్వ ఉండేదా? ఉంటే ఎక్కడి నుంచి ఉండేది? ఇప్పుడెందుకు లేదు? అనే దానిపై సమగ్ర విచారణ జరిపారు. స్థానిక రెవెన్యూ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ఐనవోలు : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) డైరీ, క్యాలెండర్‌ను సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ పులి ఆనందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. హక్కులకై నిలబడు, బాధ్యతలకై కలబడు అనే నినాదంతో పనిచేసే వృత్తి నిబద్ధత కలిగిన సంఘం టీపీటీఎఫ్ అని కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు టీపీటీఎఫ్ కృషిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిని శ్రీరామంజనేయులు, సత్యనారాయణ, అన్నారెడ్డి, పూర్వ ప్రధాన కార్యదర్శి బీమళ్ల సారయ్య, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, యాకయ్య, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఐనవోలు: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు నందనం గ్రామంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా 4.5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. బియ్యం తరలిస్తున్న చీటూరి ప్రేమ్‌రాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

10 నుంచి క్రికెట్ టోర్నమెంట్

శాయంపేట : మండల కేంద్రంలో ఈనెల 10వ తేదీ నుంచి 14వరకు మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు రైసింగ్ స్టార్స్ యూత్ నాయకులు సూర్య, శశి సోమవారం ప్రకటనలో తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 8వేల, ద్వితీయ బహుమతి రూ.6వేల నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సూర్య 9553536246, శశి 7032219238 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రోడ్డు పనులకు శంకుస్థాపన



కొత్తకొండలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ నుంచి అంతక్కపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తోందన్నారు. సన్నాలకు బోనస్ కల్పించి, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందని, విద్యార్థులకు 40శాతం డైట్ చార్జీలు పెంచిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా రూ.12వేలు ఇస్తామని చెప్పారు. భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ కానుక కింద జనవరి 26 నుంచి రూ.12వేలు ఇస్తామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్‌కార్డులు ఇవ్వలేదని, కొత్తరేషన్ కార్డుల మంజూరుకు శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో ఖజానా ఖాళీగా ఉందని, కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చి పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, నాయకులు శివయ్య, తిరుపతిరెడ్డి, మండల నాయకులు అయిలయ్య, రాజు, చంద్రశేఖర్ గుప్తా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన విద్యార్థినులు



ఆలయం వద్ద విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో గల ముఖ్యనాథస్వామి ఆలయాన్ని సోమవారం పింగిళి కళాశాల విద్యార్థినులు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది విజ్ఞాన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని కళాశాలల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ నుంచి ఒక ప్రాజెక్ట్‌ను తయారు చేస్తారని వారు తెలిపారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అందులో భాగంగానే హనుమకొండలోని పింగిళి కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అటానమస్ చరిత్ర విభాగం అధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు కాకతీయుల కాలం నాటి శిల్పం వాస్తు సంపద, ముప్పారం ఏకే స్టడీ అనే అంశంపై ప్రాజెక్ట్ చేపట్టి కాకతీయుల కాలం నాటి శిల్ప సంపద ముఖ్యనాథస్వామి ఆలయాన్ని పరిశోధన అంశంగా ఎంచుకున్నట్లు తెలిపారు. విద్యార్థినులు స్వప్న, శైలజ, అనూష, రాజేశ్వరి, రజిత, మంజుల, ఆలయ అర్చకుడు రాజు శాస్త్రి పాల్గొన్నారు.

పశువుల పెంపకంపై అవగాహన కలిగిఉండాలి

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయికిరణ్

దామెర : పశువుల పెంపకంపై రైతులు అవగాహన కలిగిఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయికిరణ్ అన్నారు. మండలంలోని రైతు వేదికలో పాడి పశువుల యాజమాన్యానికి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపశువులను (డైరీ ఫామ్) నిర్వహణతో రైతులు ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పశు పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పశువులు అనారోగ్య బారిన పడితే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. జేడీఎం శ్రీనివాస్, వేణు, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, కూలీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సాయికిరణ్

చదువుకు పేదరికం అడ్డు కావొద్దు



నోట్ బుక్కులు అందజేస్తున్న దామోదర్

ఆత్మకూరు : విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు కావొద్దని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ హైస్కూల్‌లో, అగ్రంపహాడ్‌లోని విశ్వభారతి హైస్కూల్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశాల్లో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్కులు అందించారు. ఇటీవల నిర్వహించిన సృజనాత్మక పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, విశ్వభారతి కరస్పాండెంట్ రమేశ్, ఉపాధ్యాయులు రాంచందర్‌రావు, బాలునాయక్, దేవేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



వేలేరు : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు



ధర్మసాగర్ : నిరసన తెలుపుతున్న రాజయ్య



ఎల్కతుర్తి : ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తూ..

- బీఆర్‌ఎస్ నాయకుల నిరసన
- వేలేరులో సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం, అడ్డుకున్న పోలీస్‌లు

ధర్మసాగర్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు అన్యాయం చేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దుయ్యబట్టారు. ప్రభుత్వం రైతు భరోసా రూ.12 ఇస్తామని ప్రకటించిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ కర్ర సోమిరెడ్డి, లాల్‌మహ్మద్, శోభ, విజయ్ కుమార్, ప్రతాప్, హరీష్, మధు పాల్గొన్నారు.

వేలేరు : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు అన్నారు. రైతుభరోసా రూ. 12వేలకు కుదించడంపై సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, వీరయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి, సాంబయ్య, నాయకులు జాని, ప్రభాకర్‌రెడ్డి, వెంకన్న, శ్యామ్, చిలుక రాజు, కల్యాణ్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రైతులకు ఎకరాకు రూ.15 వేలు రైతుభరోసా ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతు భరోసా రూ.12 వేలకు కుదించడాన్ని నిరసిస్తూ సోమవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భీమదేవరపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యానాయక్, ఎల్కతుర్తిలో ఆర్‌ఐ సదానందానికి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ, రవీందర్, మండల సురేందర్, పిట్టల మహేందర్, శ్రీపతి రవీందర్‌గౌడ్, గోల్లె మహేందర్, పిట్టల మహేందర్, గుండా ప్రతాప్‌రెడ్డి, చెవుల కొమురయ్య, వెంకటేష్‌యాదవ్, కుర్ర సాంబమూర్తి, రాజ్‌కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సోమవారం రైతు భరోసా రూ.12 వేలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.15వేల ఇస్తామని ఇప్పుడు రూ.12వేల ఇస్తామని ప్రకటించడం విడ్డూరమన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు పొందారు. ఆదివారం పరకాలలోని మయూరి గార్డెన్‌లో నిర్వహించిన ఓపెన్‌కరాటే చాంపియన్‌షిప్‌లో ఎంజేపీ విద్యార్థులు గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు. విజేతలైన విద్యార్థులను, కరాటే మాస్టర్ సుమన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ దామెర అనిత, ఉపాధ్యాయులు అభినందించారు.

పరకాల : క్రియేటివ్ కరాటే డో ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలు ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఈ పోటీల్లో నాలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారు. విజేతలకు పుష్ప సినిమా నటుడు కేశవ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ రంజాన్ అలీ, శ్రీనివాస్, పాపయ్య, ప్రముఖ వైద్యుడు అభిరామ్, చీఫ్ ఆర్గనైజర్ మాడ సంపత్, విశ్వశ్రీ, సాయి స్నిగ్ధేశ్ తదితరులు పాల్గొన్నారు.